సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 27 । ఫిబ్రవరి । 2025



టన్ను చీనీ రూ.23,560

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.23,560, కనిష్టంగా రూ.8,400 ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.10

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.6 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 450 టన్నుల టమాట అమ్మకానికి వచ్చింది.

గరిష్టం/కనిష్టం

37.6°/14.1°

జిల్లా వ్యాప్తంగా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చలితీవ్రత తగ్గగా.. ఎండలు పెరుగుతున్నాయి. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

వేటు పడింది

- 'కమర్షియల్ ట్యాక్స్' అధికారుల అవినీతిపై చర్యలు
- 'పురం' సీటీఓతో పాటు ముగ్గురు డీసీటీఓల సస్పెన్షన్



పురం వాణిజ్య పన్నులశాఖ కార్యాలయం

హిందూపురం అర్బన్: ఆకస్మిక తనిఖీల పేరుతో వసూళ్లు చేస్తూ అడ్డగోలుగా వ్యవహరిస్తున్న హిందూపురం కమర్షియల్ ట్యాక్స్ అధికారులపై వేటు పడింది. ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఆశాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఆ నివేదిక ఆధారంగా సీటీఓ కృష్ణవేణి, డీసీటీఓలు ఇంతియాజ్ బాషా, రాజశేఖర్‌రెడ్డి, మధుసూదన రెడ్డిలను సస్పెండ్ చేస్తూ ఆ శాఖ రాష్ట్ర కమిషనర్ బాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా త్వరలోనే మరికొందరిపై వేటు వేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఒకేసారి నలుగురు అధికారులపై వేటు పడటం ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశమైంది.

రెండు దఫాలుగా విచారణ..

హిందూపురం కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతిపై తోటి సిబ్బంది, కొందరు వ్యాపారులు ఫిర్యాదులు చేయడంతో ఈనెల 12వ తేదీన కమర్షియల్ ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ మురళి విచారణ జరిపారు. స్థానిక డీలర్లతో పాటు ఫిర్యాదుదారులతో విచారించారు. అనంతరం సీటీఓ కార్యాలయంలో అధికారులతోనూ గోప్యంగా విచారణ చేపట్టారు. అయితే విచారణ నామమాత్రంగా సాగినట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో ఈ నెల 17వ తేదీన సమగ్ర విచారణ కోసం కమర్షియల్ ట్యాక్స్ రీజినల్ ఆడిట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్ నాగేంద్ర, సంయుక్త కమిషనర్ శేషాద్రితో కలిసి సమగ్ర విచారణ చేశారు. ఫిర్యాదుదారులను, డీలర్లను మరోసారి విచారించారు. అప్పుడు కూడా తమకు అనుకూలంగా రిపోర్టు రాయించుకొనేందుకు స్థానిక కమర్షియల్ ట్యాక్స్ అధికారులు నానా తంటాలు పడ్డారు. అవేమీ పట్టించుకోని రీజినల్ ఆడిట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్ నాగేంద్ర పూర్తి వివరాలతో ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. ఈనేపథ్యంలోనే సీటీఓతో పాటు ముగ్గురు డీటీలపై సస్పెన్షన్ వేటు పడినట్లు తెలుస్తోంది.

రేపు కొత్తచెరువులో జాతీయ సైన్స్ దినోత్సవం

పుట్టపర్తి టౌన్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఈనెల 28 తేదీన కొత్తచెరువులో నిర్వహించనున్నట్లు డీఈఓ కృష్ణప్ప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు విద్యార్థులకు జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇందు కోసం ''సైన్స్ ఆవిష్కరణల్లో ప్రపంచ నాయకత్వం కోసం భారతీయ యువతను శక్తివంతం చేయడం'' అనే అంశంపై ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలలో వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. ప్రతి మండలం నుంచి ప్రథమ స్థానంలో నిలిచిన ఆరుగురిని ఎంపిక చేసి వివరాలను మండల విద్యాశాఖాధికారి గూగుల్ ఫామ్‌లో నమోదు చేసి గురువారం సాయంత్రంలోపు పంపాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులను ఈనెల 28 వతేదీ కొత్త చెరువులో జరిగే జిల్లా స్థాయి పోటీలకు పంపాలన్నారు. వివరాల కోసం జిల్లా సైన్స్ అధికారి తనూజ్ కుమార్‌ను 9492843184 నంబర్లో సంప్రదించాలన్నారు.

కాటికోటేశ్వరం.. ప్రతిధ్వనించిన ఓంకారం



చిల్లవారిపల్లి గ్రామంలో ప్రత్యేక పూజలు అందుకుంటున్న కాటికోటేశ్వర స్వామి

తాడిమర్రి: చిల్లవారిపల్లి సమీపంలో కాటికోటేశ్వర క్షేత్రంలో బుధవారం మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. భక్తులు భారీగా తరలిరాగా ఓంకార నాదంతో క్షేత్రం ప్రతిధ్వనించింది. ముందుగా భక్తులు గదా గుండంలో పుణ్యస్నానాలు ఆచరించి, ఆలయ ప్రదక్షిణలు చేసి స్వామికి కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆర్డీఓ మహేష్, డీఎస్పీ హేమంత్ కుమార్ భారీగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే చిల్లవారిపల్లిలోనూ పోలీసులు భారీగా మొహరించారు.



ప్రత్యేక అలంకరణలో హేమావతిలోని సిద్దేశ్వరస్వామి



హిందూపురంలో మహాశివలింగాన్ని ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం



అలంకరణలో ధర్మవరం విశ్వనాథుడు



లేపాక్షిలో శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

హర హర మహాదేవ

ఓంకార నాదం మార్మోగింది. పంచాక్షరీ మంత్రం ప్రతిధ్వనించింది. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. లయకారుడు...లంకేశ్వరుడు కరుణ కోసం ఆలయాల ఎదుట భక్తులు బారులు తీరారు. ఉపవాసాలు ఆచరిస్తూ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రంతా ఆలయాల్లో జాగరణ చేశారు. ఇక ప్రసిద్ధిగాంచిన హేమావతి సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. లేపాక్షిలోని వీరభద్రస్వామి దేవాలయంలో బుధవారం మధ్యాహ్నం శివపార్వతుల కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. ఏడు శిరస్సుల నాగేంద్రుని విగ్రహం వద్ద అర్చకులు కాలసర్ప దోష నివారణ పూజలు నిర్వహించారు. – సాక్షి బృందం



లేపాక్షిలో ఏడుశిరస్సుల నాగేంద్రుడి వద్ద శివలింగానికి పూజలు చేస్తున్న దృశ్యం



27,503 జిల్లాలో హైపర్ టెన్షన్ కేసులు

16,029 డయాబెటిస్ కేసులు

31,420 హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిస్ కేసులు

18,468 మంది బాధితుల్లో 30 ఏళ్ల లోపు వారు

మూడు పదులకే.. ముప్పేటదాడి!



☛ హిందూపురానికి చెందిన 27 ఏళ్ల యువకుడు బెంగళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. వర్క్ ఫ్రమ్ ఆప్షన్ ఉండటంతో ఇంటి దగ్గర నుంచే విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇటీవల ఆరోగ్య పరీక్షలు చేయించుకోగా షుగర్ ఉన్నట్లు తేలింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కంప్యూటర్ ముందు కూర్చోవడం...శారీరక శ్రమ లేకపోవడంతో పాటు మానసిక ఒత్తిడి తోడు కావడంతో షుగర్ లెవెల్స్ పెరుగుతున్నాయని వైద్యులు తేల్చారు.

☛ పుట్టపర్తిలో పని చేసే ప్రభుత్వ ఉద్యోగి వయసు 28 సంవత్సరాలు. ఏడాది నుంచి బీపీ, షుగర్ వెంటాడుతున్నాయి. దీంతో ఇప్పటికే ఇరవై మంది వైద్యులను సంప్రదించి ఉంటాడు. కానీ బీపీ, షుగర్ ఒక సారి వచ్చాక నియంత్రణలో ఉంచుకోవడం తప్ప.. పూర్తిగా నివారణ సాధ్యం కాదని వైద్యులు తేల్చారు. దీంతో ఉద్యోగం కంటే ఆరోగ్యం ముఖ్యమని భావించి.. ఆహారపు అలవాట్లు మార్చుకోవడంతో పాటు ఉదయం, సాయంత్రం వ్యాయామం చేస్తున్నాడు.

హైపర్ 'టెన్షన్'

- పట్టిపీడిస్తున్న దీర్ఘకాలిక వ్యాధులు
- రోజు రోజుకూ విజృంభిస్తోన్న బీపీ, షుగర్
- పల్లె నుంచి పట్టణం వరకు అంతటా అదే తీరు
- బాధితుల్లో 30 ఏళ్లలోపు వారే అధికం
- జీవన శైలిలో మార్పులే కారణమంటున్న వైద్యులు

సాక్షి, పుట్టపర్తి

కాలం మారింది. జీవనశైలిలో మార్పు వచ్చింది. అందరిదీ ఉరుకులు, పరుగుల జీవితమే. పనులన్నీ క్షణాల్లో అయిపోవాలన్న ఆరాటం. నిరంతరం ఆందోళనే. ఫలితంగా ఆలస్యంగా వచ్చే రోగాలన్నీ.. ముందుగానే పలకరిస్తున్నాయి. ముప్పేటదాడి చేస్తూ ఆయుష్షును హరిస్తున్నాయి. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నాయి. గతంలో 50 ఏళ్లు దాటిన తర్వాత జబ్బుల బారిన పడేవారు. ఇప్పుడు మూడు పదుల వయసుకే బీపీ, షుగర్‌తో పాటు దీర్ఘ కాలిక వ్యాధులతో సతమతమవుతున్నారు. శారీరక శ్రమ లేకపోవడంతో పాటు ఆహారపు అలవాట్లలో మార్పులతో రక్తపోటుకు గురవుతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. ఇటీవల వైద్య, ఆరోగ్య శాఖ విడుదల చేసిన గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. నిర్లక్ష్య ధోరణితోనే ఎక్కువ మంది బీపీ, షుగర్‌ల బారిన పడుతున్నట్లు తేలింది. ఈ సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోందని తెలుస్తోంది.

ఉప్పు..కార్బోహైడ్రేడ్లు తక్కువగా ఉండాలి

బీపీ, షుగర్‌కు మారిన జీవనశైలి కారణమని వైద్యులు చెబుతున్నారు. ఆహార శైలి మారాలని.. రోజూ వ్యాయామంతో పాటు మానసిక ప్రశాంతత కోసం యోగా, ధ్యానం చేయాలని సూచిస్తున్నారు. లేకపోతే రోగాల బారిన పడాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ఆహారంలో ఉప్పు, కార్బోహైడ్రేడ్లు తక్కువగా ఉండేలా చూసుకోవాలని సూచిస్తున్నారు. సమతుల ఆహారానికి ప్రాధాన్యత ఇస్తూ బీపీ, షుగర్‌కు దూరంగా ఉండవచ్చంటున్నారు.



30 ఏళ్లకే.. ముప్పు..

కంప్యూటర్ యుగంలో ఉద్యోగ రీత్యా చాలామంది శారీరక శ్రమ చేయడం లేదు. ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసేందుకు కూడా తీరిక లేని పరిస్థితి. ఫలితంగా మూడు పదుల వయసులోనే బీపీ, షుగర్ బారిన పడుతున్నారు. గతంలో వీధి కొక్కరు.. ఊరికొక్కరు ఉండేవారని చెప్పేవారు. కానీ ఇప్పుడు ప్రతి ఇంట్లో.. ప్రతి ఆఫీసులో లెక్కలేనంత మంది బీపీ, షుగర్ బాధితులు ఉండటం విశేషం. వయసుతో సంబంధం లేకుండా బీపీ, షుగర్ మనుషులను వెంటాడుతున్నాయి.

అతిగా ఆవేశపడితే అసలుకే మోసం..



ఉరుకులు, పరుగుల జీవితంలో అంతా పోటీనే. చదువుల్లో...ఉద్యోగాల్లో...వ్యాపారాల్లో..ఇలా ప్రతిచోట పోటీ ఉంటోంది. వెనుకబడతామోనన్న ఆందోళనలో చాలా మంది ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. ఉన్నత స్థానం కోసం, మెరుగైన మార్కుల కోసం, అధిక లాభాల కోసం పగలు, రాత్రి తేడా లేకుండా పరుగులు తీస్తున్నారు. కనీసం అర గంట ప్రశాంతంగా కూర్చుని భోజనం కూడా చేయడం లేదు. ఆకలివేసినా హడావుడిగా పిజ్జాలు, బర్గర్లు ఇతర జంక్ ఫుడ్ పొట్టలోకి తోసేస్తున్నారు. ఆందోళన, అధికశ్రమ, మారిన ఆహార అలవాట్లతో రోగాలు కొనితెచ్చుకుంటున్నారు. ఆ తర్వాత సంపాదించినదంతా ఖర్చు చేసినా మునపటి ఆరోగ్యాన్ని తెచ్చుకోలేకపోతున్నారు.

ఆహారపు అలవాట్లు మారాలి



మారుతున్న కాలానికి అనుగుణంగా వంటకాల్లో భారీగా మార్పులు వచ్చాయి. అయితే ఆరోగ్యానికి చేటు తెచ్చే పదార్థాల జోలికి వెళ్లకపోవడమే మంచిది. నిత్య జీవితంలో ఉప్పు వాడకాన్ని తగ్గించాలి. తరచూ బీపీ, షుగర్ లెవెల్స్ పరీక్షించుకోవాలి. ఆరోగ్యంపై దృష్టి సారించి ఆహారపు అలవాట్లలో మార్పు వస్తే ఆరోగ్యం కాపాడుకోవచ్చు.

– డాక్టర్ ఫైరోజాబేగం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి

ఇంటర్ పరీక్షలకు వేళాయె



పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

పకడ్బందీ ఏర్పాట్లు



జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాలో 42 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలు కల్పించాం. ఆయా కేంద్రాలకు మెటీరియల్ కూడా పంపాం. విద్యార్థులు హాల్ టికెట్లను బోర్డు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఆయా రూట్లలో ప్రత్యేక సర్వీసులు నడపాలని ఆర్టీసీ అధికారులకు ఇప్పటికే ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. మాస్‌కాపీయింగ్‌కు అవకాశం లేకుండా స్క్వాడ్ బృందాలను నియమించాం.

– రఘునాథరెడ్డి, ఇంటర్ విద్య జిల్లా అధికారి

- ఒకటో తేదీ నుంచి పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

పుట్టపర్తి: ఇంటర్ పరీక్షలు మార్చి ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. తొలిరోజు సెకండ్ లాంగ్వేజ్ పేపర్–1 పరీక్ష జరగనుండగా... చివరి రోజు (మార్చి 15వ తేదీ) జాగ్రఫీ పేపర్–2 పరీక్ష జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు శరవేగంగా చేస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనుండగా... విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఓఎంఆర్, ఎస్‌ఆర్ షీట్లు, ఇతర సామగ్రి ఇప్పటికే జిల్లాకు చేరుకున్నాయి.

జిల్లా నుంచి 23,987 మంది విద్యార్థులు..

జిల్లాలో మొత్తం 23,987 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో మొదటి సంవత్సరాని సంబంధించి 6,675 మంది బాలికలు, 6,408 మంది బాలురు కలిపి మొత్తంగా 13,083 మంది ఉన్నారు. అలాగే ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 5,781 మంది బాలికలు, 5,123 మంది బాలురు కలిపి 10,904 మంది పరీక్ష రాయనున్నారు. వీరికోసం జిల్లా వ్యాప్తంగా 42 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 21 పోలీస్ స్టేషన్లలో పరీక్షా పత్రాలను భద్రపరిచారు.

పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలు..

విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు తగు చర్యలు తీసుకున్నారు. పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించారు. అన్ని కేంద్రాల్లో ఫర్నీచర్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. ఎక్కడైనా ఇబ్బంది ఉంటే సమీపంలోని మరో కళాశాల నుంచి ఫర్నీచర్ సమకూరుస్తున్నారు. అలాగే 42 పరీక్ష కేంద్రాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. పరీక్ష సమయంలో విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే ప్రతి గదిలోనూ ఫ్యాన్ సౌకర్యం ఉండేలా ఏర్పాట్లు చేశారు.

సిబ్బంది నియామకం..

జిల్లాలోని 42 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనుండగా, 42 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించారు. అలాగే తనిఖీల కోసం 2 సిట్టింగ్, 2 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. పరీక్ష నిర్వహణకు మొత్తంగా 460 మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేశారు. స్పెషల్ ఆఫీసర్ ఒకరిని నియమించారు. వీరందరికీ ఇప్పటికే నియామక ఉత్తర్వులు జారీ చేశారు. పరీక్షల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల తెలిసేందుకు సమావేశం కూడా నిర్వహించారు.

ఇంటర్ ఫస్టియర్ పరీక్షల షెడ్యూల్ ఇలా....	
తేదీ	సబ్జెక్టు
01.03.25	సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1
04.03.25	ఇంగ్లిష్ పేపర్- 1
06.03.25	మ్యాథమ్యాటిక్స్-1ఏ, బాటనీ, సివిక్స్ పేపర్-1
09.03.25	మ్యాథమ్యాటిక్స్-1బీ, జువాలజీ, హిస్టరీ పేపర్-బీ
12.03.25	ఫిజిక్స్, ఎకనామిక్స్ పేపర్-1
14.03.25	కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్ పేపర్-1
16.03.25	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్,లాజిక్, బ్రిడ్జ్ కోర్సు మ్యాథ్స్ పేపర్- 1
19.03.25	మోడ్రన్ లాంగ్వేజ్, జాగ్రఫీ పేపర్-1

ఇంటర్ సెకండియర్ పరీక్షల షెడ్యూల్ ఇలా....	
తేదీ	సబ్జెక్టు
02.03.25	సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2
05.03.25	ఇంగ్లిష్ పేపర్-2
07.03.25	మ్యాథమ్యాటిక్స్-2ఏ, బాటనీ, సివిక్స్ పేపర్ -2
11.03.25	మ్యాథమ్యాటిక్స్-2బీ, జువాలజీ, హిస్టరీ పేపర్- 2
13.03.25	ఫిజిక్స్, ఎకనామిక్స్ పేపర్-2
15.03.25	కెమిస్ట్రీ, కామర్స్, ఫైన్ ఆర్ట్స్ పేపర్-2
18.03.25	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్, బ్రిడ్జికోర్సు మాథ్స్‌పేపర్-2
20.03.25	మోడ్రన్ లాంగ్వేజ్, జాగ్రఫీ పేపర్-2

'పోలవరం' ఎత్తు తగ్గించడమే సంపద సృష్టా?



మాట్లాడుతున్న రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, చిత్రంలో పార్టీ నేతలు

- జగన్ సీఎంగా ఉన్నప్పుడు ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా అంగీకరించలేదు
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: సంపద సృష్టి అంటే పోలవరం ప్రాజెక్ట్ ఎత్తు తగ్గించడమేనా అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్ట్‌ల పేరుతో కాలువల్లో నీళ్లు పారించాలనుకుంటున్నారా... లేదంటే జేబుల్లోకి నిధులు పారించాలనుకుంటున్నారా అని ప్రశ్నించారు. హంద్రీ–నీవా కాలువను రైతులకు ఉపయోగపడకుండా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. గతంలో చంద్ర బాబు 5 టీఎంసీల తాగు నీటి ప్రాజెక్ట్‌గా మార్చితే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తిరిగి 40 టీఎంసీలుగా మార్చారని గుర్తు చేశారు. పెరిగిన నీటి అవసరాలతో చివరి ఆయకట్టు ప్రాంతాలైన వైఎస్సార్, చిత్తూరు జిల్లాలకు నీళ్లు తీసుకెళ్లడం కష్టమని భావించి 2020లో అప్పటి సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక జీఓ తెచ్చారన్నారు. అప్పట్లోనే ఈ స్కీం పనులు చాలావరకు పూర్తయ్యాయన్నారు. రాయలసీమలో రైతులు చల్లగా ఉండాలనే మంచి ఆలోచనతో జగన్ అడుగులేశారన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తును 140 అడుగులకు తగ్గించాలని గతంలో కేంద్రం ఎన్ని ఒత్తిళ్లు చేసినా జగన్ ఒప్పుకోలేదన్నారు. చంద్రబాబు నేడు రాయలసీమకు తీరని అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు.

ఎవరిని మోసగించడానికి మరో స్కీం?

'చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి పులివెందుల అవసరాల పోను పంపింగ్‌ను 15 రోజులు పెంచి రూ. 2,700 కోట్లతో కొత్త ప్రాజెక్ట్‌ను తీసుకొస్తామంటున్నారు. నిజంగా మిగులుగా ఉంటే గండికోట రిజర్వాయర్ నుంచి 16 కిలోమీటర్ల ప్రెజర్ టన్నెల్ ద్వారా చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 2 వేల క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేసే స్కీంను ఎందుకు తీసుకొస్తారు' అని ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. ఎవరిని మోసం చేయడానికి ఇలా చెబుతున్నారని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్ట్ పూర్తవ్వాలన్నా కనీసం ఐదేళ్లు పడుతుందని,ఇప్పటికే చేపడుతున్న ప్రెజర్ టన్నెల్ పనులు పూర్తి కావాలన్నా 6–7 ఏళ్లు పడుతుందన్నారు. ఈలోగా హంద్రీ–నీవా కాలువ లైనింగ్ పూర్తయితే ఉమ్మడి జిల్లాలో దాదాపు 2.50 లక్షల ఎకరాల పొలాలు బీళ్లుగా మారతాయని వాపోయారు.

రాజకీయాలకు కేశవ్ స్వస్తి పలకడం మేలు!

ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ తన నియోజకవర్గంలో ఉన్న పీఏబీఆర్ భూసేకరణకు డబ్బులివ్వాలని ప్రకాష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ పని చేయించలేకపోతే రాజకీయాలకు స్వస్తి పలకడం మేలని హితవు పలికారు. జగన్ హయాంలో చిత్రావతి ఆర్‌అండ్ ఆర్‌కు సంపూర్ణంగా నిధులు ఇచ్చారని, గండికోటకు స్పెషల్ ప్యాకేజీ ఇచ్చారని గుర్తు చేశారు. సమావేశంలో అనంతపురం రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, రాప్తాడు వైస్ ఎంపీపీ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ పేరూరు నాగిరెడ్డి, నాయకులు బండి పవన్, మీనుగ నాగరాజు, జూటూరు శేఖర్, నీరుగంటి నారాయణరెడ్డి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

మైకుతో పంటకు రక్షణ!



పంట పొలంలో లౌడ్ స్పీకర్లను అమర్చిన దృశ్యం

గుడిబండ: పక్షులు, అడవి పందుల నుంచి పంటలను కాపాడుకోవడానికి రైతులు వినూత్నంగా ఆలోచిస్తున్నారు. గుడిబండ మండలం మోరుబాగల్, జంబులబండ, ఫళారం, మందలపల్లి, పీసీ గిరి తదితర గ్రామాల్లో రైతులు వేరుశనగ, రాగి, మిర్చి, మొక్కజొన్నతో పాటు పలు రకాల కూరగాయలను సాగు చేస్తున్నారు. వీటిని కాపాడుకోవటానికి మనుషులు కేకలు వేస్తున్నట్లు రికార్డు చేసి మైకులను పొలాల్లో ఏర్పాటు చేస్తున్నారు. వీటిని ఆన్‌చేసి ఉంచుతుండడంతో పక్షులు, జంతువులు పంట పొలాల్లోకి రావడం లేదని రైతులు చెబుతున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

గాండ్లపెంట: ఒద్దిరెడ్డిపల్లి శివారులో మంగళవారం రాత్రి పేకాట ఆడుతున్న తొమ్మిదిమందిని పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.77,270 నగదు స్వాధీనం చేసుకున్నారు.

స్కూటీకి నిప్పు



కాలిపోయిన స్కూటీ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సుందరయ్యనగర్‌లో సంజీవరెడ్డి అనే వ్యక్తి తన ఇంటి ముందు నిలిపిన స్కూటీకి బుధవారం తెల్లవారుజామున ఆకతాయిలెవరో నిప్పుపెట్టారు. పొగలు రావడం గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే సంజీవరెడ్డి కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. వారు వచ్చి చూసేలోపు స్కూటీ మొత్తం కాలిపోయింది. ఈ మేరకు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రాతిదూలం పోటీల విజేత తెలంగాణ వృషభాలు



రాతిదూలం లాగుతున్న వృషభాలు

పామిడి: వంకరాజుకాలువ గ్రామ సమీపాన పెన్నప్పగుడి వద్ద గ్రామస్తులు ఆధ్వర్యంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న ఎర్రితాత, పక్కీరప్ప స్వాముల 24వ వార్షికోత్సవ వేడుకలు బుధవారంతో ముగిశాయి. వేడుకల్లో భాగంగా ఆరు పళ్ల విభాగంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీల్లో తెలంగాణ వృషభాలు విజేతలుగా నిలిచాయి. తెలంగాణ రాష్ట్రంతో పాటు ఏపీలోని ఉమ్మడి అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ జిల్లాలకు చెందిన 15 జతల గాన్ల ఎద్దులు పాల్గొన్నాయి. పోటీ హోరాహోరీగా సాగింది. మహబూబ్‌నగర్ జిల్లా వృషభరాజులు ప్రథమ స్థానంలో నిలిచాయి. రెండో స్థానాన్ని అనంతపురం జిల్లా వృషభాలు దక్కించుకున్నాయి. 1 నుంచి 10వ స్థానం వరకు నిలిచిన వృషభాల విజేతలకు వరుసగా రూ. 40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.8 వేలు, రూ.6వేలు, రూ.5వేలు, రూ.4 వేలు, రూ.3వేలు, రూ.2వేల చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

సీటు సాధిస్తే.. ఉజ్వల భవితే

- అన్ని హంగులతో మోడల్ స్కూళ్లలో బోధన
- 6 నుంచి ఇంటర్మీడియెట్ వరకు సాఫీగా చదువులు
- మార్చి 31 వరకు ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ



అమడగూరు మండలంలోని ఆదర్శ పాఠశాల



నల్లచెరువు ఆదర్శ పాఠశాలలోని ఫిజిక్స్ ల్యాబ్



విద్యార్థులకు ట్యాబ్‌లపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అమడగూరు: ఆంగ్లమాధ్యమం.. సుశిక్షితులైన ఉపాధ్యాయులు.. డిజిటల్ బోధన.. అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ల్యాబ్.. రోజూ యోగా తరగతుల నిర్వహణ.. నిరంతర పర్యవేక్షణ.. పరీక్ష ఫలితాల్లో మెరుగైన ఉత్తీర్ణతతో ఆదర్శ పాఠశాలల (ఏపీ మోడల్ స్కూల్స్) దూసుకెళ్తున్నాయి. ప్రైవేట్/ కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా మోడల్ స్కూల్స్ నిలుస్తున్నాయి. పేద, మధ్య తరగతి వర్గాల పిల్లలకు ఇందులో సీటు వస్తే ఉజ్వల భవిష్యత్తుకు బాటలు పడినట్లే. గ్రామీణ ప్రాంతాల్లో సైతం మంచి ఆంగ్లమాధ్యమంలో విద్య నందించాలనే ఉద్దేశంతో 2013లో అప్పటి ప్రభుత్వం మండల కేంద్రాల్లో ఆదర్శ పాఠశాలలను (ఏపీ మోడల్ స్కూల్స్)ను తీసుకొచ్చింది. జిల్లా వ్యాప్తంగా పది ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ప్రస్తుతం 4,989 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ ఏడాది ఆరో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేశారు. మొత్తం వెయ్యి సీట్లు ఉన్నాయి. ఇక్కడ సీటు పొందేందుకు విద్యార్థులు తీవ్రస్థాయిలో పోటీపడుతుంటారు. ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారితో సీట్లు భర్తీ చేస్తారు.

ఒకేషనల్ గ్రూప్‌ల నిర్వహణ..

ఉన్నత పాఠశాలల్లో లేని విధంగా ఈ మోడల్ స్కూళ్లలో (ఆదర్శ పాఠశాలల్లో) ఒకేషనల్ తరగతులు ఉంటాయి. 9 వ తరగతి విద్యార్థులకు మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్, బ్యాంకింగ్ ఫైనాన్స్ అనే రెండు ట్రేడ్‌లు నిర్వహిస్తారు. ఈ ఒకేషనల్ తరగతులు 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు వరుసగా నాలుగేళ్ల పాటు జరుగుతాయి. ఈ తరగతులు వినడం వలన ఇంటర్ కోర్సు పూర్తి కాగానే విద్యార్థులు తమ కాళ్లమీద తాము నిలబడి బతకడానికి అవసరమయ్యే పరిజ్ఞానాన్ని సంపాదించుకోగలుగుతారు. విద్యార్థులకు రోజూ గంట పాటు యోగా తరగతులు నిర్వహిస్తారు.

4 రకాల ల్యాబ్‌లు..

మోడల్ స్కూల్‌లో నాలుగు సబ్జెక్టులకు అవసరమయ్యే ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయి. భౌతికశాస్త్రం, రసాయనిక శాస్త్రం, జీవశాస్త్రం, గణిత శాస్త్రం సబ్జెక్టులకు అవసరమయ్యే పరికరాలన్నీ సిద్ధంగా ఉన్నాయి. ప్రాక్టికల్స్ చేసుకోవడానికి ఎలాంటి ఇబ్బందులూ లేవు.

ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ..

మోడల్ స్కూల్‌లో 2025–26 సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 24వ తేదీ నుంచే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మార్చి 31 వరకు గడువు ఉంది. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఏప్రిల్ 20న సంబంధిత మోడల్ స్కూల్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుంది. పరీక్షల్లో వచ్చే మార్కులను బట్టి ప్రతిభ- రిజర్వేషన్ ద్వారా ప్రవేశం కల్పిస్తారు.

ప్రొజెక్టర్‌తో బోధన..

మోడల్ స్కూల్‌లో స్టేట్ సిలబస్ ఇంగ్లిష్ మీడియం అమలవుతోంది. అన్ని సబ్జెక్టులనూ ఎల్‌సీడీ ప్రొజెక్టర్ ద్వారా బోధిస్తారు. ప్రొజెక్టర్ ద్వారా పాఠాలు చెబితే విద్యార్థులకు ఏకాగ్రత పెరగడమే కాకుండా, విజువల్ ఎఫెక్ట్ శబ్దాలతో మాటలు, కళ్ల ముందు ఆ దృశ్యాలు గుర్తుండిపోతాయి. గత ప్రభుత్వంలో విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌లు ప్రస్తుతం వారికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

సీటు వస్తే విద్యార్థులకు వరం



మోడల్ స్కూల్‌లో సీటు వస్తే విద్యార్థులకు మంచి వరమనే చెప్పాలి. ప్రభుత్వ బడులన్నింటి కంటే ఈ ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు మంచి బోధన లభిస్తుంది. బాలికలకు వసతి గృహం కూడా ఉంటుంది. ఏ మాత్రం డబ్బులు చెల్లించాల్సిన అవసరం ఉండదు. బాగా చదుదుకోవాలనుకునే విద్యార్థులు ఇక్కడ సీటు సాధిస్తే చాలు.

– శ్రీనివాసులు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్, అమడగూరు

మెరుగైన బోధన



నేను ఆరో తరగతి నుంచి ఇక్కడ చదువుతున్నాను. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో లభించే వసతులు, మెరుగైన బోధన ఈ ఆదర్శ పాఠశాలలో ఉచితంగా లభిస్తుంది. ఇక్కడ సీటు వస్తే ఏడేళ్లపాటు అంటే ఇంటర్మీడియెట్ వరకు తల్లితండ్రులకు ఆర్థికభారం తప్పినట్లే. పాఠశాలలో ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లు, ఎల్‌సీడీ ప్రొజెక్టర్‌ల ద్వారా సులభంగా పాఠాలు చెబుతున్నారు.

– గీతిక, పదో తరగతి, తనకల్లు

దరఖాస్తు చేసుకోవచ్చు



ఆదర్శ పాఠశాలల్లో ఆరవ తరగతిలో చేరడానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమయ్యే అన్ని రకాల ల్యాబ్‌లతో పాటుగా ఇతర మౌలిక సదుపాయాలన్నీ ఉంటాయి. ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు వివరాల కోసం వారి తల్లితండ్రులతో పాటుగా ఆయా ఆదర్శ పాఠశాలలను సంప్రదించి, దరఖాస్తు చేసుకోవాలి.

– కృష్ణప్ప, జిల్లా విద్యాధికారి

అద్భుతం.. బాలభైరవుడి రూపం



రామగిరి: పేరూరుడ్యాం గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే (ఏపీఆర్‌ఎస్) బాలుర పాఠశాల ఆర్ట్ టీచర్ శ్రీరాములు బుధవారం మహాశివరాత్రిని పురస్కరించుకుని వాటర్ కలర్లు (నీటిరంగులతో) బాల భైరవుడి చిత్రం గీశారు. ఈ చిత్రాన్ని ప్రత్యేక ప్రదర్శనలో ఉంచారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు ఈ చిత్రం చూసి అద్భుతంగా ఉందని ప్రశంసించారు.

కుమారుడితో సహా వివాహిత అదృశ్యం

కదిరి టౌన్: పట్టణంలో నివాసముండే వివాహిత కుమారుడితో కలిసి బుధవారం అదృశ్యమైంది. ఇందుకు సంబంధించిన వివరాలను పోలీసులు బుధవారం విలేకరులకు తెలిపారు. కదిరికి చెందిన మహిళకు కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన వ్యక్తితో ఏడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు సంతానం. భర్తతో మనస్పర్థల కారణంగా కుమారుడిని తీసుకుని కదిరిలోని పుట్టింటికి వచ్చి ఉంటోంది. మంగళవారం సాయంత్రం కుమారుడిని స్కూలు నుంచి తీసుకొచ్చేందుకు వెళ్లిన వివాహిత తిరిగి రాలేదు. చుట్టుపక్కల గాలించినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో తల్లిదండ్రులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తిమ్మమ్మ మర్రిమానుకు పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో తిమ్మమాంబ



ఉత్సవాల్లో దుకాణాల వద్ద భక్తుల సందడి

ఎన్పీకుంట: శివరాత్రి జాగరణ మహోత్సవాల్లో రెండో రోజైన బుధవారం తిమ్మమ్మ మర్రిమాను ప్రాంతం భక్తులతో పోటెత్తింది. ఉదయం చుట్టు పక్కల గ్రామాల మహిళలు భక్తి శ్రద్ధలతో బోనాలు ఎత్తుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. కమిటీ సభ్యులు అమ్మవారికి గంధాభిషేకం చేసిన అనంతరం వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. మర్రిమాను ప్రాంతంలో చూడదగ్గ ప్రదేశాలైన తిమ్మమ్మకోట, శివప్రాజెక్టు భక్తులతో సందడిగా మారాయి. రాత్రి టూరిజం గైడ్ ఎద్దుల మనోహర్ తిమ్మమాంబ, బాలవీరయ్యల జీవిత చరిత్రను బుర్రకథ రూపంలో ప్రదర్శించారు.

అమ్మవారిని దర్శించుకున్న ఆర్డీఓ..

మహాశివరాత్రి సందర్భంగా తిమ్మమ్మమర్రిమానులో నిర్వహించిన జాగరణ మహోత్సవాల్లో కదిరి ఆర్డీఓ వీవీఎస్ శర్మ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ దేవేంద్రనాయక్, సర్పంచ్ విష్ణుమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు వెంకటనారాయణ, నారాయణస్వామి, శ్రీనివాసులు, మనోహర్, లేపాక్షి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మృతుడు ఆంజనేయులు

చిలమత్తూరు: పెద్దన్నపల్లి క్రాస్ వద్ద బుధవారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పెద్దన్నపల్లికి చెందిన ఆంజనేయులు (19) దుర్మరణం చెందాడు. ఇతడి సోదరుడు చిన్నకు తీవ్ర గాయాలు కావడంతో చిక్కబల్లాపూర్ ఆస్పత్రికి తరలించారు. మహాశివరాత్రి సందర్భంగా దేవాలయానికి వెళ్లి వస్తుండగా ఈ ఘటన జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. ఎస్‌ఐ మునీర్ అహమద్ కేసు నమోదు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి విఫలయత్నం

నల్లచెరువు: ఉబిచర్లలో ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి దుండగులు విఫలయత్నం చేశారు. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో ఇటీవలే నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఇందులో విలువైన కాపర్ వైరు కోసం దుండగులు మంగళవారం రాత్రి చోరీకి ప్రయత్నించారు. అలికిడి వినిపించడంతో స్థానికులు అటువైపు వచ్చి కేకలు వేయడంతో దుండగులు పరారయ్యారు. గ్రామస్తుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ షెక్షావలి తెలిపారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వజ్రకరూరు: జరుట్లరాంపురంలో జరుట్ల రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో స్వామివారికి విశేష పూజలతో పాటు గణపతిపూజ, నవగ్రహ పూజ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకుపూజ, అర్చనలు, ప్రత్యేక అభిషేకాలు, కలశ స్థాపన, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. గ్రామానికి చెందిన వడియంపేట శివారెడ్డి దేవతామూర్తులకు నూతన వస్త్రాలు, రథానికి ప్రత్యేక అలంకరణ, భక్తులకు ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. కర్నూలు జిల్లా హొళగొంద మండలం సులువాయి గ్రామానికి చెందిన రాఘవేంద్ర చౌదరి అనే వ్యక్తి భక్తులకు అన్నదానం చేశారు.

కమనీయం.. పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం

జరుట్ల రామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణోత్సవాన్ని తిలకించారు.

యువకుణ్ని రక్షించిన పోలీసులు



రామాంజనేయులును కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న సీఐ శేఖర్

రాప్తాడురూరల్: ఆత్మహత్యకు యత్నించిన ఓ యువకుడిని అనంతపురం రూరల్ పోలీసులు రక్షించారు. వివరాల్లోకి వెళ్తే... కూడేరు మండలం జల్లిపల్లికి చెందిన రామాంజనేయులు అనే యువకుడు వ్యక్తిగత కారణాలతో జీవితంపై విరక్తి చెంది చనిపోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు బుధవారం మధ్యాహ్నం అతని స్నేహితుడైన రాము సెల్‌కు వాట్సాప్‌కు మెసేజ్ పెట్టాడు. దిక్కుతోచని పరిస్థితుల్లో రాము తనకు పరిచయమున్న ఆత్మకూరు ఎస్బీ హెడ్ కానిస్టేబుల్‌కు విషయం తెలిపాడు. ఆయన అనంతపురం ఎస్బీ హెడ్ కానిస్టేబుల్ శీనాకు చేరవేశాడు. ఈ క్రమంలో అనంతపురం రూరల్ సీఐ శేఖర్ దృష్టికి వెళ్లింది. వెంటనే బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్లు దేవేంద్ర, నాగేంద్రను అప్రమత్తం చేశారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సోములదొడ్డి సమీపంలో ఉన్న రామాంజనేయులు వద్దకు చేరుకున్నారు. అప్పటికే రామాంజనేయులు తన వెంట తీసుకెళ్లిన టూవీలర్ టైర్ ట్యూబ్‌కు తాను ధరించిన చొక్కాని కట్టి చెట్టుకు ఉరేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నాడు. గమనించిన కానిస్టేబుళ్లు వెంటనే ఆపి కాపాడారు. జల్లిపల్లిలో ఇటీవలే ఇల్లు కొనుగోలుకు చేసిన అప్పులు అధికం కావడం... వాటిని తీర్చే పరిస్థితి కనిపించకపోవడంతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు అతడు వాపోయాడు. స్టేషన్‌కు తీసుకొచ్చిన తర్వాత సీఐ కౌన్సెలింగ్ ఇచ్చి రామాంజనేయులును కుటుంబ సభ్యులకు అప్పగించారు. సమస్యలకు చావు పరిష్కారం కాదని సీఐ సూచించారు.

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం



ఐక్యత చాటుతున్న పీఎస్‌యూ నాయకులు

ధర్మవరం: విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని పీఎస్‌యూ (ప్రగతిశీల విద్యార్థి సంఘం) జాతీయ కార్యదర్శి మహమ్మద్ షఫీవుల్లా పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్జీఓ హోంలో జరుగుతున్న పీఎస్‌యూ రాష్ట్ర మూడో మహాసభలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై తొమ్మిది నెలలు పూర్తవుతున్నా నేటికీ రాష్ట్రంలో 'తల్లికి వందనం', స్కాలర్‌షిప్, ఫీజు రీఎంబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం అన్యాయమన్నారు. ఆర్‌ఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి జానకిరాములు మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన రాయలసీమ జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. అనంతరం పీఎస్‌యూ ఏపీ రాష్ట్ర నూతన కమిటీని ఎంపిక చేశారు. పీఎస్‌యూ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా మంజుల నరేంద్ర, కార్యదర్శిగా సుబ్బరాయుడు, ఉపాధ్యక్షులుగా సురేష్, చంద్ర, సహాయ కార్యదర్శులుగా నరసింహ, అయ్యన్న, కమిటీ సభ్యులుగా నందకిశోర్, గోపి, రాంచరణ్, ప్రసాద్, మురళి, కేశవ, అఖిదానంద్ ఎంపికయ్యారు.

నందకిషోర్‌కు 'ఉమ్మడిశెట్టి' పురస్కారం



నందకిషోర్

అనంతపురం కల్చరల్: ఉమ్మడిశెట్టి సతీష్‌కుమార్ జాతీయ యువపురస్కారాన్ని ఈ ఏడాది యువకవి నందకిషోర్‌కు అందిస్తున్నట్లు పురస్కార ప్రదాత డాక్టర్ రాధేయ తెలిపారు. తెలంగాణకు చెందిన నందకిషోర్ ఓ స్వచ్ఛంద సంస్థలో ప్రాజెక్టు లీడర్‌గా పనిచేస్తూ 'నాలాగా ఒకడుండేవాడు', 'యథేచ్ఛ', 'పరాధీన', 'అదేనది' వంటి కవితా సంపుటాలు వెలువరించారు. ప్రగతిశీల దృక్పథంతో సమాజాన్ని ప్రభావితం చేస్తున్న యువకవి నందకిషోర్‌కు 'ఉమ్మడిశెట్టి' అవార్డునందించడం ఆనందంగా ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు.

శివ వందనం.. భక్త నందనం



సాయీశ్వర లింగానికి క్షీరాభిషేకం



శివవందనం కార్యక్రమంలో భక్తిగీతాలు ఆలపిస్తున్న సత్యసాయి విద్యార్థులు



ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డు ప్రశంసా పత్రాన్ని సత్యసాయి మీడియా సెంటర్‌కు అందజేస్తున్న సంస్థ ప్రతినిధి

ప్రశాంతి నిలయం: మహాశివరాత్రి పర్వదిన వేడుకలు బుధవారం ప్రశాంతి నిలయంలో ఘనంగా జరిగాయి. వేలాది మంది భక్తులు పాల్గొని సాయీశ్వరున్ని స్మరించారు. ఉదయం 'శివ వందనం' కార్యక్రమంలో భాగంగా సత్యసాయి విద్యాసంస్థల చిన్నారులు, భక్తులు సాయీశ్వరున్ని కీర్తిస్తూ భక్తిగీతాలాపన చేశారు. సాయంత్రం సత్యసాయి యజుర్ మందిరం నుంచి వేదపఠనం నడుమ సాయీశ్వరలింగాన్ని, కళాశాలను ఊరేగింపుగా సాయికుల్వంత్ సభా మందిరానికి తీసుకువచ్చి ప్రతిష్ఠింపజేశారు. అనంతరం వేదపండితులు సాయీశ్వర లింగాభిషేకం నిర్వహించారు. వేలాది భక్తులు సాయీశ్వర నామాన్ని జపించారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో అఖండ భజన ప్రారంభించారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన ఈ అఖండ భజన గురువారం ఉదయం 6 గంటల వరకు కొనసాగనుంది.

శ్రీరుద్ర మంత్రం... ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డు కైవసం

ఇటీవల ప్రశాంతి నిలయంలో నిర్వహించిన అతిరుద్ర మహాయజ్ఞంలో భాగంగా వేదపండితులు పఠించిన 'శ్రీరుద్ర' మంత్రాన్ని సత్యసాయి మీడియా సెంటర్ ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా 83 దేశాలకు చెందిన 13 వేల మంది భక్తులు జపించారు. ఇలా ఒక యాప్ ద్వారా ఇంత మంది భక్తులు మంత్రాన్ని ఒకేసారి జపించడాన్ని ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నమోదు చేసింది. బుధవారం ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి నార్ విజయ్ యాదవ్ ప్రశాంతి నిలయంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, ట్రస్ట్ సభ్యులు చక్రవర్తి, డాక్టర్ మోహన్, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ నిమిష్ పాండేల సమక్షంలో సత్యసాయి మీడియా సెంటర్ డైరెక్టర్‌కు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.